క్లుప్తంగా

బుద్ధవనంలో యోగా దినోత్సవం

నాగార్జునసాగర్ : తెలంగాణ రాష్ట్ర పర్యాటక ప్రాంత బుద్ధవనంలో యోగా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు బుద్ధవనం ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్రలు తెలిపారు. ఎన్‌సీసీ విభాగానికి చెందిన అధికారులు ఎన్‌సీసీ కేడెట్లు, బీసీగురుకుల విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 150మంది ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొంటారని ఆసక్తిగల ఔత్సాహికులు హాజరు కావచ్చని తెలిపారు. ఉదయం 6.30 నుంచి 7.30 వరకు యోగా దినోత్సవం నిర్వహిస్తునట్లు తెలిపారు.

నేడు ఆర్యవైశ్య సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం

నాగార్జునసాగర్: నల్లగొండ ఆర్యవైశ్య సంఘం జిల్లా మొదటి కార్యవర్గ సమావేశం శనివారం విజయవిహార్‌లోని అతిధిగృహంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తెలుకుంట్ల చంద్రశేఖర్, ఎల్ శ్రీనివాస్‌లు తెలిపారు. శుక్రవారం నాగార్జునసాగర్‌కు వచ్చిన వారు విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశానికి రాష్ట్ర, జిల్లా, 33మండలాల అధ్యక్షులంతా హాజరవుతారని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్యవైశ్యులకు అన్ని పార్టీల నుంచి సముచిత స్థానాలు కల్పించాలని, అన్ని మండలాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాల గురించి జిల్లా కేంద్రంలో ఆర్యవైశ్య సంఘ భవన నిర్మాణం, తదితర అంశాలపై జిల్లా కార్యవర్గం చర్చిస్తుందని తెలిపారు.

బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడిగా సాయిగౌడ్



డిండి : భారతీయ జనతా పార్టీ(బీజేపీ) డిండి అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన బాదెమోని సాయి గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆపార్టీ మండల అధ్యక్షుడు శింకారు సైదా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సాయిగౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలను అప్పగించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

ధర్తి ఆబా అభియాన్‌పై అవగాహన

పెద్దఅడిశర్లపల్లి : జన్ జాతీయ గౌరవ్ వర్ష్ వేడుకల్లో భాగంగా ధర్తి ఆబా అభియాన్‌పై శుక్రవారం మండలంలోని ఎర్ర గుంటతండాలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ హాస్టల్ వార్డెన్ లక్ష్మయ్య మాట్లాడుతూ ఈ అభియాన్ కింద ఉమ్మడి పెద్దఅడిశర్లపల్లి మండలంలో పడమటితండా, చింతల్‌తండా, పుట్టంగండి, పెద్దగుమ్మడం, నంభాపురం, పెద్దగట్టు, ఎర్రగుంటతండా, కేశంనేనిపల్లి, గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపిక చేసిన గ్రామాల్లోని గిరిజన విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు,సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ఉపాధి హామీ పనులను శుక్రవారం గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, కేంద్ర జలసంఘం నోడల్ అధికారి సంతోష్‌కుమార్ పరిశీలించారు. మండలంలోని అల్వాల, శ్రీరాంపురం, నెల్లికల్లు, పిల్లిగుండ్లతండా, గోడుమడక, నాగార్జునపేట గ్రామ పంచాయతీలలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిర్మించిన భూగర్భ జలాల నిల్వల పెరుగుదల పనులను ఆయన క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించారు. నీటి సంరక్షణ పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మిర్యాలగూడెం క్లస్టర్ ఏపీడీ బాలకృష్ణ, ఏపీఓ శీనయ్య, టీఏ చారి, టెక్నికల్ అసిస్టెంట్ బాలాజీ, కార్తీక్ రెడ్డి, చంద్రశేఖర్, జ్యోతి, ఆయా గ్రామపంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వైభవంగా వార్షిక కల్యాణోత్సవం

మిర్యాలగూడ : మండలంలోని యాద్గార్‌పల్లిలో కొలువైన శ్రీ అగస్త్యేశ్వరస్వామి వారి దేవాలయ అష్టమ వార్షిక కల్యాణ మహోత్సవ కార్యక్రమం శుక్రవారంఆలయ కమిటీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసె.ప్రసాద్, అంగోతు హాతీరాంనాయక్, పాదూరి సంజీవరెడ్డి, కర్నాటి రమేష్, గౌరు శ్రీనివాస్, వెలిశెట్టి రామకృష్ణ, జెట్టి లింగయ్య, శేఖర్‌రావు, ఈశ్వర్ నాయక్, రవీందర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

నిడమనూరు : మండలంలోని బంకాపురం గ్రామానికి చెందిన శిలువేరు ధనలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చేరింది. స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులు ఎమ్మెల్సీకోటిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి కుటుంబ పరిస్థితి వివరించారు. ఎమ్మెల్సీ కోటిరెడ్డి ప్రభుత్వం నుంచి ఆమె వైద్య ఖర్చుల కోసం రూ.2లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించి ఆపత్రాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎల్‌ఓసీ మంజూరు చేయించినందుకు ఎమ్మెల్సీకి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా సంఘాలకు సోలార్ ప్లాంట్లు

- నిడమనూరు మండలంలో ఏర్పాటుకు ప్రణాళికలు
- ముప్పారం, ఎర్రబెల్లి గ్రామాల్లో ప్రభుత్వ భూముల పరిశీలన



నిడమనూరు : ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించి వారిని వ్యాపారవేత్తలుగా, ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పలు ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. దీనిలో భాగంగా ప్రభుత్వం,మహిళల భాగస్వామ్యంతో సోలార్‌ప్లాంట్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. దీనిలో భాగంగా నిడమనూరు సబ్‌స్టేషన్ పరిధిలోని ఎర్రబెల్లి, ముప్పారం, నిడమనూరు గ్రామాల్లోని ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందిస్తుంది. ఈ సందర్భంగా ఇటీవల డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి ప్రభుత్వ భూములను పరిశీలించారు. వీటి స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వమే భూమిని సమకూర్చి రుణ సదుపాయం కల్పించనుంది. ఒక్క మెగావాట్ సోలార్ ప్లాంట్ నిర్మాణానికి 4ఎకరాల భూమి అవసరం. ఒక్కో ప్లాంట్ ఏర్పాటుకు రూ.3కోట్ల నుంచి 4కోట్ల వరకు వ్యయం అవుతోంది. ఈ ప్లాంట్ల ఏర్పాటుకు ఆర్థికసాయం కోసం బ్యాంకులు, డీఆర్‌డీఏలు మూలధనం, ప్రాజెక్టు వ్యయానికి అందించడానికి సుముఖంగా ఉన్నట్టు తెలిసింది. 10శాతం వాటాదనం మహిళా సంఘాలు, మహిళా సమాఖ్యలు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అయితే పలు మహిళా సంఘాలు ధాన్యం కొనుగోళ్లతో వచ్చిన కమీషన్లతో కావాల్సినంత మూలధనంతో సమాఖ్యలు పటిష్టంగా ఉన్నాయి.

స్థలాల పరిశీలన

నిడమనూరు మండలంలో పలు ప్రభుత్వ భూములు, దేవాదాయ భూములను పరిశీలించారు. నిడమనూరు మండలకేంద్రంలో 294 సర్వేనంబర్‌లో ప్రభుత్వభూమిని, ముప్పారం సబ్‌స్టేషన్ సమీపంలోని గుట్ట సర్వే నంబరు 153, 703లో, ఎర్రబెల్లిలోని ఎర్రగుట్ట సర్వే నంబరు 494లో 115 ఎకరాల ప్రభుత్వభూమి ఉంది. ఈ నేపథ్యంలో స్థానిక మహిళలతో సోలార్‌ప్లాంట్ల ఏర్పాటుకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

ఒక్కో యూనిట్‌కు రూ.3.13లకు కొనుగోలు

సోలార్ ప్రాజెక్టు ద్వారా విద్యుత్ కొనుగోలుకు టీజీ రెడ్కో, టీజీ ఈఆర్‌సీతో ఒప్పందాలు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం విద్యుత్ సంస్థలు యూనిట్‌ను రూ.3.13లకు కొనుగోలు చేస్తోంది. సగటున రోజుకు 4వేల యూనిట్లు ఉత్పత్తి చేస్తారు. దీంతో నెలకు లక్షా 20 వేల యూనిట్లు ఉత్పత్తి అవుతోంది. దీంతో నిర్వహణ వ్యయాలు పోనూ 1 మెగా వాట్ సోలార్ ప్లాంటు ప్రాజెక్టు ద్వారా రూ.2లక్షల 16 వేల నికర ఆదాయం వస్తోంది. ఏడాది 25లక్షల92 వేల వరకు ఆదాయం వస్తోందని డీఆర్‌డీఏ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. 25 సంవత్సరాల వరకు సోలార్ ప్లాంట్ల ద్వారా ఆదాయం వస్తోంది. దీనికి తోడు నిడమనూరు మండలంలో మారుపాకలో ప్రైవేట్ ఆధ్వర్యంలో సోలార్ ప్లాంటు పదేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. దీనిలో పలువురు మహిళలు కూలి, క్లీనింగ్ వంటి పనులు చేస్తుంటారు. దీంతో ఈ ప్రాజెక్టుపై పలువురు మహిళలకు అవగాహన ఉంది. ఇంధిరా మహిళా శక్తి పథకంలో సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసుకొనేందుకు మహిళా సంఘాల ప్రతినిధులు ఆసక్తి చూపుతున్నారు.

సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు సిద్ధం



సోలార్ పవర్ ప్లాంటు ఏర్పాటుకు వనరులు ఉన్నాయి. స్థానిక మహిళలు నుంచి కూడా సుముఖత వ్యక్తం అవుతోంది. ఎర్రబెల్లి, మారుపాక మహిళలకు కొంత అనుభవం ఉంది. 10శాతం నిధులు ఏర్పాటు చేసేందుకు నిడమనూరు మహిళా సమాఖ్య కూడా సిద్ధంగా ఉంది.

– లక్ష్మీనారాయణ, ఏపీఎం

మరిన్ని అవకాశాలు కల్పించాలి



మహిళల ఉపాధికోసం అవకాశాలు విస్తృతం చేయాలి. పలు అవకాశాలతో ఆర్థికంగా పురోగతి సాధించవచ్చు. రెండున్నర దశాబ్దాలుగా బ్యాంకుల ద్వారా మహిళలు రుణాలు తీసుకుంటున్నారు. సక్రమంగా చెల్లిస్తున్నారు. దీంతో మహిళా సంఘాలకు రుణాలు అందించేందుకు బ్యాంకులు, ప్రభుత్వ సంస్థలు ముందుకు రావాలి

– బి ధనలక్ష్మి, మహిళా సంఘం సభ్యురాలు

జానారెడ్డి, ఉత్తమ్‌ల జన్మదిన వేడుకలు



మిర్యాలగూడ : కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, తదితరులు



మిర్యాలగూడ టౌన్ : కేక్ కట్ చేస్తున్న ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఆరీఫ్

మిర్యాలగూడ : మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం మాజీ మంత్రి జానారెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాదిల శ్రీనివాస్‌ల జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌లు కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేసి మాట్లాడారు. జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు ఇలాంటి జన్మదినాలను మరెన్నో జన్మదినాలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

మిర్యాలగూడ టౌన్ : మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల జన్మదిన వేడుకలను శుక్రవారం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఆరీఫ్ కట్ చేసి చిన్నారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థి, యువజన నాయకులు తదితరులున్నారు.

దేవరకొండ ఎస్‌బీఐలో యూనియన్ డే

దేవరకొండ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దేవరకొండ శాఖలో శుక్రవారం యూనియన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ హైదరాబాద్ సర్కిల్ ఓబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌వీటీ, బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ఫణిధర్, సిబ్బందితో కలిసి బ్యాంక్ ఎదుట యూనియన్ జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. వై.తారకనాథ్ వర్ధంతిని పురస్కరించుకొని యూనియన్ డే జరుపుకుంటున్నట్లు తెలిపారు. తారకనాథ్ యూనియన్ కోసం ఎన్నో త్యాగాలు చేశారని ఆయన గుర్తు చేశారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో పాండు నాయక్, వెంకట్రాం, చరణ్, శ్రీనివాస్, గోపాలకృష్ణ, శాంతానాయక్, సాయి కిషోర్, శ్రీనయ్య, వెంకన్న, మనీషా, స్వాతి, నీరజ పాల్గొన్నారు.



యూనియన్ డే వేడుకల్లో బ్యాంక్ ఉద్యోగులు

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండల కేంద్రానికి చెందిన సింగారపు వెంకటేశ్వర్లు ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబానికి చిన్ననాటి స్నేహితులు అండగా నిలిచారు. మండల కేంద్రానికి చెందిన షేక్ గాలిసాహెబ్‌తో పాటు, ఇతర స్నేహితుల సహకారంతో పోగుచేసిన రూ.77,500లను శుక్రవారం ఆ కుటుంబానికి అందజేశారు. మృతుడి కుటుంబ సభ్యులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిట్టల కృష్ణ, రాచమళ్ల ఆంజనేయులు, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

ప్రైవేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలని వినతి



ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

మిర్యాలగూడ : పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల ఫీజు దోపిడీని నివారించాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి సంఘాల నాయకులు శుక్రవారం బత్తుల లక్ష్మారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడారు. పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులను వసూలు చేయడమే కాకుండా తమ పాఠశాలల్లోనే యూనిఫాం, టై, బెల్టులను కొనుగోలు చేయాలని నిబంధన పెడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రైవేట్ పాఠశాలల దోపిడీని నివారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సయ్యద్‌ఫారుఖ్, తాళ్లపల్లి సురేష్, ఇస్లావత్ సైదానాయక్, పరంగి సురేష్, గాదగోని మహేష్‌గౌడ్, లావూరి రవీందర్‌నాయక్ పాల్గొన్నారు.

సీఐ, ఎస్‌ఐల బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న హాలియా సీఐ సతీష్‌రెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌ఐ సాయి ప్రశాంత్



ప్రసాద్, ఎస్‌ఐ, పెద్దవూర



నరేశ్, ఎస్‌ఐ, త్రిపురారం

హాలియా : హాలియా సీఐగా డి సతీష్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. హాలియా సీఐగా పని చేసిన జనార్దన్‌గౌడ్ ఐజీ ఆఫీస్‌కు అటాచ్ కాగా, ప్రస్తుతం హాలియా ఎస్‌ఐగా పని చేస్తున్న సతీష్‌రెడ్డికి సీఐగా ప్రమోషన్ కల్పించారు. దీంతో ఆయన హాలియా సీఐగా బాధ్యతలు స్వీకరించారు. హాలియా ఎస్‌ఐగా సాయి ప్రశాంత్ బాధ్యతలు స్వీకరించారు. తిప్పర్తి ఎస్‌ఐగా పని చేసిన సాయి ప్రశాంత్ బదిలీపై హాలియాకు వచ్చారు.

పెద్దవూర ఎస్‌ఐగా ప్రసాద్

పెద్దవూర: పెద్దవూర మండల ఎస్‌ఐగా వై.ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన త్రిపురారం మండల ఎస్‌ఐగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన పి.వీరబాబును నల్లగొండ వీఆర్‌కు అటాచ్ చేశారు.

త్రిపురారం ఎస్‌ఐగా నరేష్

త్రిపురారం : స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండల ఎస్‌ఐగా నరేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మిర్యాలగూడ షీ టీంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై త్రిపురారం వచ్చారు. ప్రస్తుతం త్రిపురారంలో విధులు నిర్వహించిన వై ప్రసాద్ పెద్దవూర మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎస్‌ఐ నరేష్ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహించాలి

మాడుగులపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు దారమల్ల నాగరాజు అన్నారు. శుక్రవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంతవరకు క్లారిటీ లేదన్నారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేక అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

- దేవరకొండ ఏఎస్పీ మౌనిక



మాట్లాడుతున్న ఏఎస్పీ మౌనిక

డిండి : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు ముందుకు రావడం సంతోషకరమని దేవరకొండ ఏఎస్పీ మౌనిక అన్నారు. మండల పరిధిలోని తవక్లాపూర్ గ్రామానికి చెందిన డాక్టర్ గుంత శ్రీనివాస్ ఏపీ ఫార్మా కంపెనీ ద్వారా సీఎస్ఆర్ నిధులతో తవక్లాపూర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో సుమారు రూ.20లక్షల వ్యయంతో మౌలిక వసతులు కల్పించారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన సభకు ఏఎస్పీ మౌనిక ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. మంచిగా చదువుకుని పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆమె విద్యార్థులకు సూచించారు. గుంత శ్రీనివాస్ మాట్లాడుతూ తను పుట్టి, పెరిగిన గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో పాలు పంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గోప్యానాయక్, పాఠశాల హెచ్‌ఎం రాజేందర్‌రెడ్డి, గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

హాలియా : ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ర శంకర్‌నాయక్ అన్నారు. శుక్రవారం హాలియా పట్టణంలో ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం ప్రభుత్వ అనుమతితో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో సామాన్య ప్రజలకు, పేదలకు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 25శాతం ఉచిత సీట్లు ఇవ్వాలని విద్యా హక్కు చట్టం చెబుతుందన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యను వ్యాపారమే లక్ష్యంగా పెట్టుకొని డబ్బులు దండు కుంటున్నారన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కీమ్ ద్వారా గిరిజన విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న డబ్బులను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రమావత్ నరేష్ నాయక్, ఉద్యోగ విభాగ రాష్ట్ర అధ్యక్షులు జటావత్ చంద్రుడు నాయక్, సంఘం నాయకులు గుగులోతు శ్రీను, బాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సమ్మె నోటీసు అందజేత

మిర్యాలగూడ : జూలై 9న నిర్వహించే దేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మెలో భాగంగా శుక్రవారం దామరచర్ల గ్రామపంచాయతీ కార్మికులు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. వెంటనే లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జహీర్, విజయ్, సైదులు, శ్రీరాములు, జోలమ్మ, సుందరమ్మ, సుక్కనాయక్, సైదులు తదితరులు పాల్గొన్నారు.



దామరచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో సమ్మె నోటీస్ అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

యూనిఫాం పంపిణీ



విద్యార్థికి యూనిఫాం అందజేస్తున్న తహసీల్దార్

గుర్రంపోడు : మండలంలోని పల్లిపహాడ్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం తహసీల్దార్ పి.శ్రీనివాస్ విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను తమ ఊరి బడిలోనే చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కిరణ్‌కుమార్, టీచర్ గ్లోరీ ఇవాంజలిన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన భూభారతి సదస్సులు

నిడమనూరు : భూమి సమస్యల పరిష్కారానికి చేపట్టిన భూ భారతి సదస్సులు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు నిడమనూరు, బంకాపురం గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కృష్ణయ్య మాట్లాడుతూ మండలంలో మొత్తంగా 2,027 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. మిస్సింగ్ సర్వే నెంబరు -193, పెండింగ్ మ్యూటేషన్-193, డిజిటల్ సిగ్నేచర్ పెండింగ్--8, విస్తీర్ణం సవరణలు-179, భూమి స్వభావం-27, పట్టాదారుని వివరాలు-10, నిషేధిత జాబితా-38, అసైన్‌మెంట్-532, ఓఆర్సీ-2, పీవోటీ-694, సాధా బైనామా-186, ఇతరములు -6 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ దాడి రాజిరెడ్డి, సందీప్, అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

మిర్యాలగూడ టౌన్ : బాల్య వివావాహాలను నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మిర్యాలగూడ అర్బన్ సీడీపీఓ రేఖల మమత అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ మండలం అవంతిపురంలో కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో ×ఆడపిల్లల సాధికారిత₹ అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ఆయుర్వేదిక డాక్టర్ హేమాంజలి, వెంకన్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక, కేజీబీవి ఉపాధ్యాయులు గీత, కృష్ణవేణి, నాగమణి, పద్మ, అరుణ, మహేశ్వరీ, దుర్గ, శోభారాణి, విజయ, నిర్మల, బాలికల పాఠశాల ఉపాధ్యాయురాలు స్రవంతి, ఎఎన్‌ఎం భవానీ, ఆశా వర్కర్ వెంకటరమణ, రుక్మిణి, అరుణ, బ్లాక్ కో ఆర్డినేటర్ కవిత, అవంతిపురం అంగన్‌వాడీ టీచర్ అంజలిలతో బాలికలు తదితరులున్నారు.

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని హెల్త్ ఎడ్యుకేటర్ జి.అనసూర్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో చైల్డ్ ఎంపవర్‌మెంట్ బై లైన్ డిపార్ట్‌మెంట్‌పై విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేనరిక వివాహాలకు దూరంగా ఉండాలని, విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఎవరైన వేధింపులకు గురిచేస్తే 1098, 181, 100 నంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీపీసీ మహేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాదమ్మ, అంగన్‌వాడి టీచర్లు కళావతి, రమణ, పుష్ప, పాపమ్మ, ఉపాధ్యాయులు హిమబిందు, కృష్ణవేణి, బ్యూలారాణి, విమల, పాల్గొన్నారు.

మాడుగులపల్లి : మండలంలోని కుక్కడం కేజీబీవీ విద్యార్థినులకు సూపర్‌వైజర్ పరిమి రజిని శుక్రవారం బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థినులకు బాల్య వివాహాల కలిగే అనర్థాలను, ఆపద సమయంలో హెల్ప్‌లైన్లను ఉపయోగించడం గురించి, గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్, అక్రమ రవాణ, లైంగిక వేదింపులు, పౌష్టికాహారం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శాంతా, ఎస్‌వో వసంతకుమారి, సూపర్‌వైజర్స్ నాగమణి, లక్ష్మీ, సునీత, ఉపాధ్యాయులు జ్యోతి, శ్వేత, కల్పన, వసీం, పరమేశ్వరి, భవాని పాల్గొన్నారు.



మిర్యాలగూడ టౌన్ : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ రేఖల మమత



తిరుమలగిరి(నాగార్జునసాగర్) : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు



మాడుగులపల్లి : కేజీబీవీ విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్



అడవిదేవులపల్లి : కేజీబీవీలో..

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలలో విద్యార్థినులకు ×కిశోర బాలిక సాధికారత₹ అంశంపై శుక్రవారం అవగాహన కల్పించారు. బాలికలకు శారీరకంగా, మానసికంగా, వికాసాభివృద్ధి సాధించడం అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఆర్. నాగేశ్వర్‌రావు, బిసి వెల్ఫేర్ ప్రిన్సిపాల్ మల్లీశ్వరి, ఉపాధ్యాలు జి.అనురాధ, పద్మప్రియ, శోభరాణి, ఎంఎల్‌హెచ్‌పి సువర్ణ, అనూష, డిడబ్ల్యూవో జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నిడమనూరు : మిషన్ వాత్సల్య కార్యక్రమంలో భాగంగా స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో కౌమర దశలో వ్యక్తగత భద్రత, పరిశుభ్రతపై అంశాలపై కిశోరా బాలికలకు అవగాహన కల్పించారు. బాలకార్మిక చట్టాలు, బాల్య వివాహాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి అంశాలు, మేనరికపు వివాహాలు, న్యూట్రిషన్ ఫుడ్ గురించి వివరించారు. సీజనల్ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఐసీపీఎస్ మహేశ్, సూపర్‌వైజర్ సైదాబేగం వివరించారు. ఈ కార్యక్రమంలో ముకుందాపురం సూపర్‌వైజర్ షహీన్ సుల్తాన్, ఆరోగ్య శాఖాధికారి మేరీ స్టెల్లా, ఏఎన్‌ఎం సుమలత, కేజీబీవీ ఎస్వో పద్మారాణి, అంగన్‌వాడీ టీచర్ రాజేశ్వరీ, వర్కర్ సుశీల, కిషోరా బాలికలు పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దామరచర్ల సీడీపీఓ చంద్రకళ పాల్గొని మాట్లాడారు.బాలికలకు పౌష్టికాహారం, వ్యక్తిగత శుభ్రతపై వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగరాణి, రమణి, నాగలక్ష్మి, బేబి, రేణుక, ముత్యాలమ్మ పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని సాగర్ రోడ్డులోని పెండ్లిపాకల ఎక్స్ రోడ్డు వద్ద కొండమల్లేపల్లి పోలీసులు శుక్రవారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ అజ్మీర రమేష్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడుపరాదని, సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడంతో ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని తెలిపారు. తనిఖీలలో కానిస్టేబుల్ మజీద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తే కఠిన చర్యలు

అడవిదేవులపల్లి : ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల తహసీల్దార్ రాగ్యానాయక్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. పర్మిషన్లు లేకుంటే వాహనాలను సీజ్ చేయనున్నట్లు తెలిపారు. దామరచర్ల, త్రిపురారం మండలంలో టాస్క్‌ఫోర్స్ వారు వాహనాలను సీజ్ చేయనున్నట్లు తెలిపారు.